
# అవసరానికో అప్పుడు



ద్విభాష్యం రాజేశ్వరరావు

"రామచంద్రం !"

పిలుపు విని వెనక్కు తిరిగి చూసేను.

"నువ్వు....మీరు రామచంద్రంగారు కదూ!" అంటూ ఆ వ్యక్తి నా దగ్గరకు వచ్చేడు. అనుమానంగా అతనివంక చూస్తూ ఔనన్నట్లు తల ఆడించేడు.

"మీరు నర్సీపట్నం స్కూల్లో చదివేరు కదూ?" అన్నాడు నా వంక తదేకంగా, ఆప్యాయంగా చూస్తూ.

నా చేతిలోని సూట్ కేసు చాలా బరువుగా వుంది. విజయవాడ ప్లాట్ ఫారం మీద రైలుదిగి లైసెన్సు కూలీకి రూపాయిన్నర ఇవ్వటం ఇష్టంలేక, ఓవర్ బ్రిడ్జి మీద నుండి సూట్ కేసును మోసుకొని బయటకు వచ్చేసరికి చేతులు పడిపోయినంత పనయింది. రిక్షా బేరంచేద్దామనుకునే సమయానికి ఈ శాల్తీ ఎవరో తగిలేడు. ముఖం పరిచయమయినదిగానే కనబడుతోంది. కాని పోల్చుకోలేకపోయాను.

అతని తలవెంట్రుకలు చాలా భాగం నెరిసిపోయాయి. బిరుసెక్కిన గెడ్డంలో కూడా అక్కడక్కడ తెల్లవెంట్రుకలు దర్శనమిస్తున్నాయి. కనురెప్పల క్రింద ఏర్పడిన నల్లని మచ్చలు, లోతుకుపోయిన కళ్ళు - ఇవి ఆ మనిషి వయసును పెంచి చెబుతున్నాయి. మాసిపోయిన ఖద్దరు షరాయిమీద మాసినా తెలియని రంగుగళ్ళ లాల్చీ తొడిగేడు. మెడదగ్గర బొత్తాన్ని కూడా కాజాలో దూర్చి బిగించేడు.

క్షణకాలం అతని ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా అతని వంక చూస్తూ వుండిపోయాను. సూట్ కేస్ నేలమీద పెట్టి అలసట తీర్చుకుంటూ, "అవును, నర్సీపట్నంలోనే చదివేను," అన్నాను.

"నా మొదటి ప్రశ్నకే సమాధానం చెప్పేవు. రెండోదానికి చెప్పలేదు. అంటే, నన్ను గుర్తుపట్టలేదన్నమాట." అంటూ క్షణకాలం ఎగాదిగాచూసి చిరునవ్వుతో "నువ్వు చలమయ్యగారి అబ్బాయివి! వి. రామచంద్రానివి! ఏనుగులశాల దగ్గర వుండేది మీ ఇల్లు! అంతదూరం నుండీ డాక్టరు గారింటికి నెమలిని చూడడానికి వచ్చేవాడివి. అవునా?" అంటూ అడిగేడు.

అతడు చెప్పినవన్నీ నిజాలే!

మా ఇల్లు ఏనుగులశాల దగ్గరలో వుండేది!

రోజూ సాయంకాలం నెమలిని చూడటానికి ఓ డాక్టరుగారింటికి వెళ్తూండేవాణ్ణి!

నా పేరుతో అతగాడు పిలిచినపుడే అతడు నన్ను సరిగ్గా పోల్చుకున్నాడని అర్థమయింది. మరి ఇంకా ఈ దండకమంతా ఎందుకు?

తనెవరో చెప్పుకోవచ్చు కదా?!

నాకు విసుగనిపించింది. అయినా, ఆ విసుగుదలను కనుపించనివ్వలేదు.

మళ్ళీ ఆ వ్యక్తిని జ్ఞప్తికి తెచ్చుకోడానికి ప్రయత్నించేను.

నాకు సాధ్యం కాలేదు!

ఉహూ! అతడే చెప్పుకోవాలి!

ఆ వ్యక్తిని గుర్తుపట్టలేకపోయినందుకు నేను సిగ్గుపడలేదు కాని, ఎందుకో అతగాడి ముఖంలోకి నేరుగా చూడలేకపోయాను. అతడి చేతిలో యూరియా బస్తా కాగితంతో కుట్టబడిన చేతిసంచీ వుంది. ఒకనాడు దాని రంగు తెలుపే అయినా ఈవేళ అది మాసిపోయి బిరుసెక్కి జిడ్డుగా కనుపిస్తోంది. ఆ సంచీలోంచి ఒక తువ్వాలు, లుంగీ

బయటకు తొంగిచూస్తున్నాయి. మిగిలిన సామాన్లు అడుగువైపున కూరివుండటం వలన సరిగ్గా కనబడటంలేదు.

"సారీ! మీరెవరో నాకు గుర్తుకు రావటంలేదు. నన్ను మా త్రం మీరు సరిగ్గా గుర్తించేరు," అన్నాను.

"నేనురా! ప్రకాశాన్ని!....నర్సింహం మేస్టారి అబ్బాయిని! రావిచెట్టు దగ్గర వుండేవాళ్ళం కదా!...." నేనూ, నువ్వు, లక్ష్మణరావు కలిసి తిరిగేవాళ్ళం...." అంటూ చెప్పుకుపోతున్నాడు.

సిగ్గుపడిపోయాను నేను, నిస్సందేహంగా!

వీడు ప్రకాశమా?

నర్సింహం మేస్టారి అబ్బాయా?

వీణ్ణి గుర్తించలేకపోవటం ఎంత అన్యాయం?

వాడికి ఇరవై ఎనిమిదేళ్ళ వయసు ఉండాలి, నా అంచనా సరియైనదైతే! నా కంటె రెండేళ్ళు చిన్నవాడు!!

అయితే, వాడి ముఖంలో ఈ వృద్ధాప్యపు ఛాయలేమిటి?

"రేయ్! ప్రకాశం! ఏమీ అనుకోకురా,గుర్తించలేకపోయాను. ఇదేమిట్రా ఇలా అయిపోయావ్?" అన్నాను ఆప్యాయంగా.

ఆ మాటలు అంటుంటే ఏదో గొంతులో అడ్డుపడినట్లయింది.

అది దుఃఖమో, బాధో చెప్పలేను!

ప్రకాశం బదులు పలకలేదు!

"ఎక్కడినుండి వస్తున్నావ్?" అంటూ అడిగేను.

"ఈ రైల్లోనే దిగేను. నర్సీపట్నం నుంచే వస్తున్నా! ప్లాట్‌ఫారమ్మీదే నిన్ను చూసేను. అయినా పలకరించటమా, మానటమా అనే సంశయంలో పడ్డాను. గుర్తించటానికి కూడా కొంత సమయం పట్టిందనుకో! ఊఁ! నువ్వెక్కడినుండి? విశాఖపట్నం పోర్టు ట్రస్టులో పనిచేస్తున్నావని విన్నాను. నిజమేనా?" అన్నాడు.

"పోర్టులో చేరి ఆరేళ్ళయిపోయింది! మా మామగారిది ఈ వూరే! మా ఆవిడ పురిటికి వచ్చింది. చూసిపోదామని వచ్చేను."

"నువ్విప్పుడు అర్జంటుగా ఊళ్ళోకి వెళ్ళిపోవాలా?" అడిగేడు ప్రకాశం నా వంక అదోలా చూస్తూ.

"ఫర్వాలేదు. అలా హోటల్లో కూర్చొని కొంతసేపు కబుర్లు చెప్పుకుందాం," అంటూ నేలమీది సూట్‌కేస్ అందుకోబోయాను. ప్రకాశం అడ్డుతగిలి తనే దాన్ని అందుకున్నాడు.

"నేను తీసుకుంటానులే!" అంటూ అతడి చేతిలోంచి తీసుకోటానికి యత్నించేను.

"ఫర్వాలేదు. నేను పట్టుకుంటాను." అంటూ బలవంతంగా సూట్‌కేస్ తీసుకున్నాడు. తరువాత తాపీగా "పద!" అన్నాడు.

నేనూ, ప్రకాశం స్కూల్లో కలిసి చదువుకున్నాం. మేం ఫోర్తుఫారం చదువుతూవుండగా హఠాత్తుగా నర్సింహం మేస్టారు గుండె జబ్బుతో చనిపోయారు. అప్పటినుండీ ప్రకాశానికి కడుపునిండా తిండికూడా కరువయింది. మేనమామ సహాయంతో ఎస్సెస్సీ వరకూ చదివేడు.

ఆ తరువాత మళ్ళీ మేమిద్దరం ఇదే కలవటం!

దారిద్ర్యం మనిషిని ఎంత నీచస్థితికి దిగజారుస్తుంది?

మౌనంగా నడుస్తున్నాం.

ప్రకాశంచేత సూట్‌కేసు మోయించకూడదని మనసు పరిపరివిధాల చెబుతోంది, అయినా వారించలేకపోయాను. హోటలుకు చేరుకునేవరకూ మా ఇద్దరి మధ్యా మాటలు కరువయ్యాయి.

ఒక మూలగా వున్న టేబులుముందు కూలబడ్డాను.

సూట్‌కేసు, సంచీ వారగా పెట్టి నా ఎదురు కుర్చీలో కూర్చున్నాడు ప్రకాశం!

"కాఫీ త్రాగుదాం!" అన్నాను.

ప్రకాశం రెండు క్షణాలు మౌనంగా వుండి తరువాత అన్నాడు. "నాకు చాలా ఆకలిగా వుంది. నీ కభ్యంతరం లేకపోతే టిఫిన్ తింటాను."

రెండు చేతులతోటి నా పీక నొక్కుకుని చావాలనిపించింది!

ప్రకాశం వాడిపోయిన ముఖాన్ని చూస్తూ కూడా 'నువ్వు టిఫిన్ తింటావా'? అని ఎందుకు అడగలేకపోయాను?

మనసులో చాలా నొచ్చుకున్నాను.

"సారీ, ప్రకాశం! నువ్వు కడుపునిండా తిను. నేను ఏలూరులో టిఫిన్ తిన్నాను. రైల్వే గారెలు యింకా అరగలేదు. ఇంతలో అరుగుతాయనే నమ్మకం కూడా లేదు. అందుకని నేను కాఫీ తాగుతాను. నువ్వు మొహమాట పడకు!' అంటూ ఇడ్లీ, పూరీ తర్వాత దోసె ఆర్డరిచ్చాను.

అన్నిటినీ చాలా ఆశగా తిన్నాడు ప్రకాశం.

తింటూ మధ్యలో మంచినీళ్ళు గడగడా త్రాగేస్తూ తన కథ ముక్కలు ముక్కలుగా చెప్పుకొచ్చాడు.

స్కూలుఫైనల్ తర్వాత చదువుకు అతడి మేనమామ సహాయం చేయలేదట! రకరకాల ఉద్యోగాలు చేసి దేనిలోనూ నిలదొక్కుకోలేకపోయాడట! సినిమా హాలు దగ్గర టిక్కెట్లు ఇవ్వటంలాంటి రకరకాల ఉద్యోగాలు ఎన్నో చేసినట్లు చెప్పేడు. అందులో నాలుగు డబ్బులు మిగిలేవి. ఏవీ కనబడలేదు నాకు!

"ప్రస్తుతం ఉద్యోగనిమిత్తం విజయవాడ వచ్చేను. నువ్వు కనబడబట్టి సరిపోయింది, లేకపోతే ఈ టిఫిన్‌కూడా డబ్బుల్లేవు," అన్నాడు.

కొంతసేపు ఏం మాట్లాడాలో తోచలేదు నాకు.

కాఫీ త్రాగుతూ మళ్ళీ వాడేఅన్నాడు. "నీకు సురేంద్ర గుర్తున్నాడా?"

సురేంద్ర మాకు స్కూల్లో రెండేళ్ళు సీనియర్. శ్రీమంతుల బిడ్డ.


ఇప్పుడు ఈ వూళ్ళోనే 'హార్డువేరు' బిజినెస్ చేస్తున్నాడు. ఏదో పేపరు మిల్లులో షేర్లు కూడా కొన్నాడట. చాలా ఆర్జించేడని విన్నాను. ఆ మధ్య ఒక హత్యకేసులో ఇరుక్కొని నానా కష్టమూ పడి బయటపడ్డాడని కూడా తెలిసింది. సురేంద్రమీద నాకెందుకో మొదటినుండీ సదభిప్రాయంలేదు. అతడు డబ్బు ముసుగులో చేసే అన్యాయాలు చాలా విన్నాను నేను.

"జ్ఞాపకం లేకేం? ఈ వూళ్ళోనే వున్నాడు కదా. ఈ మధ్య కలియలేదు, కాని వాడి గురించి వింటున్నాను." అన్నాను.

"ఈ మధ్య సురేంద్ర కలప కొనడానికి నర్సీపట్నం వచ్చేడు. అప్పుడు కలిసేను. నా పరిస్థితి అంతా వివరించి చెప్పేను. నాకు ఒకదారి చూపమన్నాను. నాకు మాత్రం ఎవరున్నారు? పెళ్ళీ పెటాకులు ఎలాగూ లేవు. నా ఒక్కడి దినమూ గడవటానికి దారి చూపించమని వేడుకున్నాను.

"నా స్థితికి చాలా జాలిపడ్డాడు సురేంద్ర. ఇంతకాలం తనకు ఈ విషయం ఉత్తరం రాయనందుకు చాలా కోప్పడ్డాడు. వెంటనే బయలుదేరి విజయవాడ రమ్మన్నాడు. ఖర్చుల నిమిత్తం రెండువందలు ఇచ్చేడు. చిల్లర అప్పులన్నీ తీరిస్తే కేవలం టిక్కెట్టుకు డబ్బులు మిగిలేయి. వీడు దారి చూపిస్తాడనే ఆశతో వచ్చేను," అన్నాడు ప్రకాశం.

సురేంద్ర ప్రకాశం యెడల ఇంత ఉదారంగా ప్రవర్తించేడంటే నాకు నమ్మబుద్ధికాలేదు. ఎందుకంటే సురేంద్ర ప్రాణానికీ డబ్బుకీ లంకె. ఒకసారి నర్సీపట్నం పాత విద్యార్థి సంఘంవారు విరాళంకోసం వెళ్తే మూడురూపాయలిచ్చి వాళ్ళని పంపేశాడట. ఇక ఏ సంస్థకూ ఒక పైసాకూడా విరాళం ఇచ్చిన సంగతి నేను వినలేదు. తన షాపులో పనిచేసేవాళ్ళకే సరిగ్గా జీతాలివ్వడని అందరూ సురేంద్ర గురించి చెప్పుకోటం నాకు తెలుసు. అలాటివాడు ప్రకాశం యెడల ఇలా ప్రవర్తించాడంటే ఆశ్చర్యంగానే వుంది.




"నువ్వు నిజంగా అదృష్టవంతుడివే. కాని సురేంద్రకు ముక్కుమీద కోపం. అందునా ఇప్పుడు నీకు యజమాని వాడు. కాస్త జాగ్రత్తతో వ్యవహరించు." అన్నాను, ఇంకేం చెప్పాలో తోచక.

"బ్రతుకుతెరువుకోసం పొట్ట చేత్తో పట్టుకు వచ్చినవాడిని. నేను దేనికయినా సిద్ధమే. ఏదో దారి చూపిస్తానన్నాడు కదా. అదే పదివేలు." అన్నాడు ప్రకాశం. అతడు ఎంత నిర్లక్ష్యంగా మాట్లాడాలని యత్నించినా అతని కంఠంలో సురేంద్ర యెడల గౌరవం మాత్రం నాకు కనిపిస్తూనేవుంది.

తరువాత కొద్దిసేపు ఇద్దరం చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకున్నాం. విశాఖపట్నం వస్తే తప్పక రమ్మని నా క్వార్టరు ఎడ్రసు ఇచ్చేను. ఖర్చులకోసం దగ్గర వుంచుకోమని ఇరవై రూపాయలు తీసి ఇచ్చేను. ప్రకాశం ఆ సహాయానికి నిరాకరించలేదు. ఆ డబ్బు అందుకుంటూ వుండే వాడి కళ్ళు చెమ్మగిల్లటంమాత్రం స్పష్టంగా గమనించేను. హోటల్లోంచి బయటకు వచ్చి రిక్షా ఎక్కేను.

* * *

ఆ తరువాత సుమారు ఒక సంవత్సరం వరకూ నాకు ప్రకాశం సంగతులేవీ తెలియలేదు.

ఓరోజు మధ్యాహ్నం భోజనంచేస్తూ వుండగా బయటనుండి "రామచంద్రం!" అని కేక వినపడింది.

"భోజనం చేస్తున్నారు, కూర్చోండి." అంటోంది మా శ్రీమతి. అవతలి కంఠం గుర్తుపట్టేను. అది ప్రకాశానిది.


"ఎవరది? ప్రకాశమేనా?" అన్నాడు.

"అవునురా, నేనే." అంటూ సరాసరి డైనింగ్ టేబుల్‌వద్దకు వచ్చేడు.

శ్రీమతికి వాడిని పరిచయం చేశాను.

నేను ఏడాదిక్రితం చూసిన ప్రకాశానికీ, ఇప్పటి ప్రకాశానికీ పోలికలు లేవు. మనిషి బాగా మారిపోయాడు.

బెల్ పేంటు, షర్టు వేశాడు. నెరిసిన తెల్ల వెంట్రుకలకు రంగువేసినట్లు




అలవోకగా తెలుస్తోంది. 'హైహీల్స్ షూ' తొడిగేడు.

దర్జాగా, హుందాగా వున్నాడు ప్రకాశం.

చేతిలో సిగరెట్ వైభవంగా కాలుతోంది.

"చాలా మారిపోయావ్ ప్రకాశం! నాకు చాలా ఆనందంగా వుంది,"అన్నాను ఏమనాలో తోచక.

ప్రక్కనున్న కుర్చీ ఇవతలకు లాగి కూర్చున్నాడు.

"భోజనంచెయ్యి! నీకూ వడ్డించమంటాను," అంటూ మా ఆవిడవంక తిరిగి —

"ప్రకాశానికి కూడా వడ్డించు" అన్నాను.

"అబ్బే! వద్దురా! ఇప్పుడు స్టేషన్‌కు వెళ్ళిపోవాలి! ఓ ప్రయివేటు కంపెనీలో 'స్క్రేప్‌స్టీలు' వేలంపాటకు వచ్చాను. పని సవ్యంగా అయిపోయింది. కడుపు నిండా టిఫిన్‌తిని, స్టేషన్‌కువెళ్తూ దారిలో నిన్ను చూసిపోదామని వచ్చేను. ఓ కప్పు కాఫీ ఇస్తేచాలు!" అన్నాడు.

మా శ్రీమతి కాఫీ కలిపి తీసుకురావటానికి వంటింట్లోకి వెళ్ళింది.

ప్రకాశం ఈ ఏడాదిలో తన జీవితంలోని మలుపుగురించి టూకీగా చెప్పేడు. తాను సురేంద్రకు కుడిభుజంలా తయారయ్యేడట! ముఖ్యమయిన వ్యవహారాలన్నీ తన సలహాలమీదనే అతడు చేస్తున్నాడట తనకు నెలకు నాలుగు వందలు జీతం ఇస్తున్నాడట! సురేంద్ర ఇంటి వెనుక ఔట్‌హౌస్ తన నివాసమట! కేంపులకు వెళ్తే 'బేటా' బాగా ఇస్తున్నాడట! అపుడే బ్యాంకులో తన ఎకౌంట్లో రెండువేలకుపైగా నిలవ వెయ్యటం జరిగిందట! సురేంద్ర తనను ఇంట్లో మనిషిలా చూసుకుంటున్నాడట! వీటన్నిటికీ మించి తన పేర లక్ష రూపాయలకు ఇన్సూరెన్సు పాలసీ తీసుకుని ప్రీమియం సురేంద్ర కడుతున్నాడట! త్వరలో మంచి సంబంధంచూసి పెళ్ళిచేసి ఔట్‌హౌస్ తనపేర రాసేస్తానన్నాడట సురేంద్ర!

ఈ విషయాలు చెప్తూవుంటే ప్రకాశం గొంతు గద్గద మయింది. "సురేంద్ర నిజంగా దేవుడు. అతడిమీద బోలెడు అపప్రథ లున్నాయి. మనిషి పైకి దుర్మార్గంగా కనిపించినా అతడి హృదయం నవనీతం. నా యెడల ఎంతో ఆదరంగా వుంటున్నాడు. బహుశః అది నా పూర్వజన్మ సుకృతం," అంటూ ఆవేశంగా చెప్పేడు.

ప్రకాశం చెప్పిన మాటవల్ల సురేంద్రమీద నాకున్న దురభిప్రాయం కొంతవరకూ తగ్గింది.

నిజానికి ప్రకాశానికి నేనూ మిత్రుణ్ణే! తల్చుకుంటే ఇంతో అంతో సాయం చెయ్యగల్గిన స్థితిలోనే వున్నాను కాని ఆ రోజు హోటల్లో ఇరవై రూపాయలు మాత్రం చేతిలోపెట్టి నా దారిన వెళ్ళిపోయాను.

సురేంద్ర మిత్రుని యెడల చాలా ఔదార్యం చూపుతున్నాడనే చెప్పుకోవాలి. మిగిలినవాళ్ళ యెడల ఎలా ప్రవర్తించినా అది వేరేసంగతి!

కాఫీ త్రాగి రైలుకు వేళయిందంటూ బయలుదేరాడు ప్రకాశం!

"సురేంద్రకూడా నిన్ను చూడాలనుకుంటున్నాడు! విజయవాడ వస్తే తప్పకుండా కలుసుకో!" అంటూ హడావుడిగా వెళ్ళిపోయాడు.

* * *

ఆ తరువాత—

మరో తొమ్మిది నెలలకుగాని, నాకు విజయవాడ వెళ్ళటం కుదరలేదు. మా మామగార్కి ఒంట్లో బాగాలేదని ఉత్తరం వస్తే శ్రీమతినీ, పిల్లలనూ తీసుకని బయలుదేరి వెళ్ళేను.

విజయవాడ వెళ్ళిన మొదటిరోజంతా ఇల్లుకదలటం కుదరలేదు.

రెండోరోజు మామగార్ని హాస్పిటల్‌కు తీసుకువెళ్ళి పరీక్షలు చేయించటంతో గడిచిపోయింది.

ఆమరునాడు ప్రకాశాన్నీ, సురేంద్రనూ చూద్దామని బయలుదేరాను.

సురేంద్ర ఆఫీసుకు నేరుగావెళ్ళేను.

బిసెంటురోడ్డు వెనుక పెద్ద ఆవరణలో హార్డువేరుషాపు, సురేంద్ర ఆఫీసురూము కలిసే వున్నాయి. ఆవరణ

చుట్టూ ఇనుపకంచె వుంది. భవంతి ముందుభాగంలో ఒత్తుగా క్రోటను మొక్కలు వున్నాయి.

ప్రక్కగా ఆగివున్న మూడు లారీల్లోకి కూలీలు ఏవో సామాన్లు ఎక్కిస్తున్నారు.

మెల్లగా గేటువద్దకు వెళ్ళేను. అక్కడ ఘూర్కా నిలబడి వున్నాడు. సురేంద్రకోసం వచ్చినట్లు చెప్పేను.

నన్ను సాదరంగా తీసుకువెళ్ళి విజిటర్స్ రూములో కూర్చోబెట్టాడు. నా పేరు కాగితంమీదరాసి చీటీ లోనికి పంపేను. రెండునిమిషాల్లోనే లోనికి రమ్మని పిలుపు వచ్చింది.

సురేంద్ర కూర్చున్న ఎయిర్‌కూల్డ్ రూములో అడుగుపెట్టాను. నన్ను చూడగానే సురేంద్ర తన కుర్చీలోంచి లేచివచ్చి నన్ను కౌగిలించుకున్నంత పనిచేశాడు.

ఎన్నోసార్లు విజయవాడ వచ్చి తనని కలుసుకోకుండా వెళ్ళిపోయినందులకు ఎంతో నిష్ఠూరంగా మాట్లాడేడు. తరువాత బోయ్‌ని పిల్చి కూల్‌డ్రింక్స్ రప్పించేడు. సురేంద్ర యెడల ఈ మధ్యకాలంలో నేను పెంచుకుంటూ వచ్చిన గౌరవం మనిషిని చూశేక మరింత బలపడింది.


చిన్ననాటి మిత్రుల వివరాలు పేరు పేరునా అడిగి తెలుసుకున్నాడు.

"ఆ మధ్య ప్రకాశం విశాఖ వచ్చినపుడు నీ వివరాలన్నీ చెప్పేడు. వాడి జీవితంలో నువ్వే దీపం వెల్గించావని చెప్పి ఎంతో ఆనందించేడు...." అంటూ ఇంకా ఏదో చెప్పబోయాను.

సురేంద్ర ముఖం అంతలోనే వాడిపోయింది.

అతని కన్నుల్లో నీళ్ళు తిరిగేయి.

ముఖం ఎర్రగా చేసుకున్నాడు. రుమాలు తీసి కళ్ళు ఒత్తుకున్నాడు.




"ఇంతకీ ప్రకాశం...." అంటూ నేను మాట్లాడబోయేలోగా నా మాటలకు అడ్డుపడుతూ "ప్రకాశం చచ్చిపోయిన సంగతి నీకు తెలీదా?" అన్నాడు.

నాకు మతిపోయినట్లయింది.

నా చెవులను నేనే నమ్మలేక పోయాను.

"ప్రకాశం చచ్చిపోయాడా?" అన్నాను ఆశ్చర్యంగా.

"అవును. ఎలక్ట్రిక్ షాక్ తగిలి చచ్చిపోయాడు. ఫేన్‌కోసం ప్లగ్‌పిన్ పెడుతూవుంటే ఈ దారుణం జరిగింది. నేనూ అక్కడే వున్నాను. నేను జరిగిన విషయం తెలుసుకునేలోగానే అంతా జరిగిపోయింది అది ఆత్మహత్య కాదనీ కేవలం ప్రమాదంవల్ల జరిగిందనీ ఋజువు చెయ్యటానికి నా తలప్రాణం తోకకి వచ్చింది. ప్రకాశం చాలా మంచివాడు. నాకు సర్వస్వం అతడే అయ్యేడు, ఈ మధ్యకాలంలో! ఈ రెండు నెలలలుగా నాకు పిచ్చెత్తినట్లయింది, అతడు లేకపోవటంతో! అలాంటి స్నేహితుణ్ణి




కోల్పోవటం నా దురదృష్టం!" అంటూ మళ్ళీ కన్నీళ్ళు ఒత్తుకున్నాడు.

జీవితం ఒక గాడిలోపడి సుఖపడే రోజులు వచ్చిన వేళలో ప్రకాశానికి నూరేళ్ళూ నిండిపోవటం ఎంత ఘోరం? బాధాకరమయిన రోజులు ముగిసి వికృష్ట జీవితంలోంచి అందమయిన భవిష్యత్తులోకి అడుగుపెట్టే తరుణంలో ఇలా జరగటం ఎంత విషాదం?

కొంతసేపు మౌనంగా వుండిపోయాను.

మళ్ళీ సురేంద్రే అన్నాడు. "వాడి జీవితానికి ఓమార్గం చూపాలనుకున్నాను. నా బోట్‌హౌస్ ఈ మధ్యనే వాడి పేర రాసేను. వాడికిమాత్రం ముందూ వెనకా ఎవరున్నారు? అందుకే మా బంధువుల్లో ఒక అమ్మాయిని ఇచ్చి వచ్చే నెలలో పెళ్ళికూడా చేయాలనుకున్నాను. కాని అన్నిటికీ సమయం మించిపోయింది నా చేతుల్తోనే వాణ్ణి పిడికెడు బుగ్గి చేశాను," అంటూ మాట్లాడడం ఆపేడు.

కొద్దిసేపట్లో సురేంద్రనుండి శెలవు తీసుకుని, బయలుదేరాను.

వచ్చేస్తూవుంటే "విజయవాడ వచ్చినప్పుడు తప్పక కనిపిస్తూవుండు" అన్నాడు.

"అలాగే" అంటూ బయటకువచ్చేను.

రోడ్డుమీద నడుస్తున్నా నన్నమాటే గాని మనసు మనసులో లేదు. ప్రకాశం రూపం కనులముందు మెదుల్తోంది. వాడి దురదృష్టానికి చింతించటం మినహా ఏంచెయ్యగలను?

ఇంటికి తిరిగి వస్తూంటే మా 'కజిన్' వెంకట్రావు కనుపించేడు. వాడు ఈ వూళ్ళోనే ఇన్సూరెన్సు ఆఫీసులో పని చేస్తున్నాడు.

"ఒరేయ్! రామచంద్రం!" అంటూ రోడ్డుమీద వెళ్ళేజనమంతా ఒక్కక్షణం ఆగి మావంకే చూసేలా, గట్టిగా పిలిచేడు.

నాకు దగ్గరగా వచ్చి భుజంమీద చెయ్యివేసి గట్టిగా కుశల ప్రశ్నలు వేయటం ఆరంభించేడు.

నేను మూడు రోజుల క్రితమే విజయవాడ వచ్చినట్లు తెలుసుకుని నిష్ఠూరంగా మాట్లాడేడు. "మూడు రోజులక్రితం ఈ పట్నంలోకి వచ్చి నన్ను నువ్వు కల్సుకోలేదంటే విన్నెలా అర్థంచేసుకోవాలో నాకు బోధపడటం లేదు. ఓ యాభయివేలకు పాలసీ తీసుకొమ్మంటానని నీ భయం! అవునా? నాకు తెలుసులేవోయ్! ఈ మధ్య బంధువులు, స్నేహితులు మన దగ్గిరకు రావటమే మానేశారు. నేనే ఇలాగ రోడ్డుమీద పట్టుకుంటున్నాను—ఊ! ఏమిటి సంగతి? మీ మామగారు ఎలా వున్నారు? మొహం అలా వుందేం?" అంటూ అంతా తనే అయి మాట్లాడటం ఆరంభించేడు.

రోడ్డుమధ్యలో నిలబడి అంత గట్టిగా మాట్లాడుతూ వుంటే చచ్చే సిగ్గనిపించింది

నేను ఏమీ మాట్లాడకపోయేసరికి "ఎక్కడనుంచి వస్తున్నావ్?" అన్నాడు మళ్ళీ.

"బిసెంటురోడ్డుకు వెళ్ళేను ఆ వెనక 'సురేంద్ర అండ్ కంపెనీ' వుందికదా? దాని ప్రొప్రయిటరు సురేంద్ర నా చిన్నప్పటి స్నేహితుడు. అతన్ని కలిసి వస్తున్నాను" అన్నాను మెల్లగా.

"ఏమిటీ! సురేంద్ర నీ స్నేహితుడా? వెరీగుడ్! వాడి రొట్టె ఈమధ్య మరో మారు విరిగి నేతిలో పడింది! వాడి స్నేహితుడు ఎవడో ప్రకాశం అని వున్నాడులే! వాడు కరెంటు షాక్ తగిలి చచ్చిపోయేడు. వాడికి లక్షరూపాయల పాలసీవుంది. దానికి 'నామినీ' సురేంద్ర! ఈ రోజుల్లో అదృష్టంకూడా వున్నవాడికే వరిస్తుందనుకో! ఆఫీసులో ఆ 'పాలసీ' గురించి తర్జనభర్జన లవుతున్నాయి. ఏది ఏమైనా ఈ నెలాఖరుకు సురేంద్రకు లక్షరూపాయలు అందటం మాత్రం ఖాయం?...." అంటూ కబుర్లు చెప్పుకుపోతున్నాడు వెంకట్రావు.

ఇక నాకు ఆ కబుర్లు ఏవీ చెవికి ఎక్కటంలేదు.

"....వాడికి లక్షరూపాయల పాలసీ వుంది దానికి 'నామినీ' సురేంద్రే!...." అన్న మాటలే చెవుల్లో సుడుల్లా తిరుగుతున్నాయి.